# మోసం చేసిన చెప్పులు

– వై. యం. శాస్త్రి

'వరకట్నానికి నూతన వధువు బలి'

'కట్నం తేలేదని భార్యను సజీవ సమాధి చేసిన కిరాతకుడు'

'అత్తగారి ఆరళ్ళు భరించలేక కోడలి ఆత్మహత్య'

'వరకట్నం కేసులో నిందితుడు అరెస్టు'

''ఛ! పేపరు తీస్తే చాలు ఈవార్తలు లేనిరోజు ఉండదు. అసలు దీనికి అంతం లేదా?'' కృష్ణ ఆవేదన!

''ప్రభుత్వం ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది కదా! ఈ వరకట్నం గురించి పట్టించుకోదేం?'' రవి ఆవేశం!

''ఏపాపం ఎరుగని ఎంతమంది అమాయక యువతులు దీనికి బలైపోతున్నారో!'' కార్తీక్ ఆక్రందన.

''నాయనా! వీటి గురించి పట్టించుకోవలసింది కేవలం ప్రభుత్వం కాదు. ఎవరికి వారే 'మేము కట్నం తీసుకోము' అని యువకులందరూ గట్టిగా నిర్ణయించుకుంటే ఈ సమస్య పరిష్కారమైనట్లే!'' కిరణ్ చాలా తేలిగ్గా అనేశాడు.

''అయితే మన నలుగురం కట్నం తీసుకోకూడదని ఇప్పుడే ప్రమాణం చేద్దాం'' రవి అదే ఆవేశంతో అన్నాడు.

''అది అంత తేలిక కాదు. ఇంట్లో వాళ్ళతో చాలా గొడవలొస్తాయి. ఒకోసారి ఇల్లు వదిలిపోయే పరిస్థితి కూడా వస్తుంది'' కిరణ్ ఇప్పుడు కూడా ఆవేశపడకుండా పరిస్థితి వివరించాడు.

''అయినాసరే! కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకుంటామనీ, లేకపోతే ఇల్లు వదలి వెళ్ళిపోతామని మనమే బెదిరిద్దాం'' కార్తీక్ కూడా ఆవేశంగా అన్నాడు.

''కట్నం తీసుకోకుండా చేసుకుంటే మనలో ఏదో లోపం ఉందనుకుంటేనో'' కృష్ణలో ఎక్కడో స్వార్థం, కొంచెం భయం!

''ఏది ఏమైనాసరే! మనం కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోబోతున్నట్లు ఈరోజే పేపర్లో ప్రకటిద్దాం. కులమతాలతో సంబంధం లేదనీ, అందంతో పనిలేదనీ, చదువు, సంస్కారం, సంప్రదాయం ఉన్న యువతులు అయితే చాలనీ తెలియజేద్దాం. మీరందరూ ఓకేనా?'' ఇప్పుడు కూడా కిరణ్ చాలా నిదానంగా ఆలోచించి అడిగాడు.

''సరే!'' అందరూ ఒక్కసారిగా చేతుల్లో చేతులు వేసుకుని ప్రమాణం చేయడం, పేపర్లో ప్రకటన ఇవ్వడం జరిగిపోయింది. అందులో వారి వయసు, ఉద్యోగం, చదువు వివరాలన్నీ వ్రాశారు. ఫలానా నెంబరుకి కాంటాక్ట్ చేయమని ఫోన్ నెంబరు ఇచ్చారు.

అప్పటి నుంచి ఫోన్ కాల్స్ కోసం ఎదురుచూడడం మొదలెట్టారు. ప్రకటన అయితే ఇచ్చారుగానీ ఏం జరుగుతుందోనని ఉత్కంఠ అందరిలోనూ కనిపించింది. తమకు ఎలాంటి వాళ్ళు వస్తారో, తమ జీవితంలో అనుకున్నది సాధించగలరో లేదో.. అన్నీ సందేహాలే!

• • •

సుమ, శ్రావ్య, సుధ, సుజాత నలుగురు మంచి స్నేహితురాళ్ళు. వాళ్ళు కూడా ఈ వరకట్నపు చావులు చదివీ, వినీ ఏమైనాసరే కట్నం తీసుకోని వారినే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఆరోజు పేపర్లో వచ్చిన ఆ ప్రకటన వారి నెంతో ఆకర్షించింది. ఇంట్లో వారికి చెబితే ఏ అడ్డంకులు వస్తాయోనని ఎవరికీ చెప్పకుండా వారు ఆ నెంబరుకి ఫోన్ చేశారు. వాళ్ళకంతా కలా, నిజమా అన్నంత థ్రిల్లింగ్‌గా ఉంది.

'ఈ పెళ్ళిళ్ళకు తాము సిద్ధమేననీ, ఎక్కడ వాళ్ళని కలుసుకోవాలనీ' ఫోన్‌లో అడిగారు. ప్రస్తుతం కృష్ణ వాళ్ళింట్లో అందరూ ఊరెళ్ళారు గనుక వాళ్ళింట్లో కలుసుకుందామని కృష్ణ ఇంటి అడ్రసు చెప్పారు. అందరిలోనూ ఏదో తెలియని కంగారు, మరెంతో ఉత్సాహం!

కృష్ణ వీధిలో నిలబడి రాబోయేవారి కోసం ఎదురుచూస్తున్నాడు. అతని స్నేహితులు కూడా ఇంకా రాలేదు. 'వాళ్ళకన్నా ఆ అమ్మాయిలే ముందు వస్తే బావుండును. అందరిలోకి అందమైన అమ్మాయిని తను సెలక్ట్ చేసుకోవచ్చును' అతనిలో స్వార్థం నిద్రలేచింది.

అతను కోరుకున్నట్లే ఆ అమ్మాయిలే ముందు వచ్చారు. ''రండి! నాపేరు కృష్ణ'' అని సంతోషంగా అందరినీ లోనికి ఆహ్వానించాడు. అందరిలోకి అందమైన సుమని చేసుకోవాలని నిర్ణయించుకుని కాజువల్‌గా ఆమె కాళ్ళకున్న అందమైన చెప్పులని చూసిన అతని బుర్రలో ఒక ఫ్లాష్ వెలిగింది.

వారందరినీ హాల్లో కూర్చోమని కూల్‌డ్రింక్స్ ఆఫర్ చేసి, ఫ్రెండ్స్ కోసం బయటికి వచ్చాడు. అప్పుడే ముగ్గురూ బైక్ దిగారు.

> **కృష్ణ వీధిలో నిలబడి రాబోయేవారి కోసం ఎదురుచూస్తున్నాడు. అతని స్నేహితులు కూడా ఇంకా రాలేదు. 'వాళ్ళకన్నా ఆ అమ్మాయిలే ముందు వస్తే బావుండును. అందరిలోకి అందమైన అమ్మాయిని తను సెలక్ట్ చేసుకోవచ్చును' అతనిలో స్వార్థం నిద్రలేచింది.**

''ఒరేయ్! వాళ్ళు వచ్చేశారు. ఏమిటంత ఆలస్యం?'' కృష్ణ అడగడం ఏదో మామూలుగా ఉందికానీ అందులో అతని ఆనందాన్నీ, స్వార్థాన్నీ ఎవరూ కనిపెట్టలేకపోయారు.

''ఇంతకూ ఎవరు ఎవరిని చేసుకోవాలో ఎలా నిర్ణయించుకోవడం?'' రవి కంగారుగా అడిగాడు.

''ఎవరికి నచ్చిన అమ్మాయిని వారు చేసుకుంటే సరి!'' కిరణ్ ఎప్పట్లానే చాలా మామూలుగా అనేశాడు.

''ఒకమ్మాయే ఇద్దరికి నచ్చితేనో!'' కార్తీక్ సందేహం!

''నేనొక ఐడియా చెప్పనా? వాళ్ళు చెప్పులు బయట వదిలి వెళ్ళారు కదా! ఒక్కొక్కళ్ళు ఒకోరకం సెలక్ట్ చేద్దాం. ఆ చెప్పులు ఎవరివైతే వాళ్ళని చేసుకోవలసిందే!'' కృష్ణ తన మనసులో మాట చెప్పేశాడు.

మిగతావారికి అవంత నచ్చకపోయినా, 'తరువాత ఎందుకొచ్చిన గొడవలు తమ మధ్య' అని గత్యంతరం లేక ఒప్పుకున్నారు.



''నాయనా! సలహా ఇచ్చినవాడివి. ఆపని ముందు నువ్వే చేయి.'' అన్నారు.

స్నేహితులు ముందుగా తనకే అవకాశం ఇవ్వడంతో మనసులో పొంగుతున్న ఆనందాన్ని అణచుకొని, తాను ఇంతకు ముందు చూసిన, నచ్చిన అమ్మాయి చెప్పులు సెలక్ట్ చేశాడు. ఆ తరువాత మిగిలిన ముగ్గురూ.

ఇంకా వీళ్ళు లోపలికి రాకుండా బయటేం చేస్తున్నారా అని బయటికి వచ్చిన అమ్మాయిలు, విషయం తెలుసుకుని ఎవరి చెప్పులు వాళ్ళు వేసుకున్నారు.

అయితే ఇంతకు ముందు అందంగా ఉన్న సుమ ఆమె వేసుకున్న చెప్పులు కాక వేరేవి వేసుకోవడం చూసి కృష్ణ హతాశుడయ్యాడు. అతను సెలక్టు చేసిన చెప్పులు శ్రావ్య వేసుకుంది. ఆమె అందరిలోకి అతి సామాన్యంగా ఉంది.

''అదేమిటి ఈ చెప్పులు మీవికావా?'' కృష్ణ అడగకుండా ఉండలేకపోయాడు. అందరూ అతనికేసి ఆశ్చర్యంగా చూశారు.

''సారీ! ఆ చెప్పులు మా శ్రావ్యవే. బావున్నాయని కాసేపు వేసుకుంటానని తీసుకున్నాను'' సుమ తాపీగా చెప్పింది.

''అయితే ముందే నువ్వు వాళ్ళలో ఎవరు అందంగా ఉన్నారో సెలక్టు చేసుకుని, వాళ్ళ చెప్పులు గుర్తుపెట్టుకుని, ఈఐడియా ఇచ్చావన్నమాట. ఒరేయ్! ఇంత స్వార్థం పనికిరాదురా!'' రవి ఆవేశం.

''నువ్వింత మిత్రద్రోహి అనుకోలేదు.'' కార్తీక్ ఆక్రందన.

''పోనీలేరా పాపం వదిలేయండి. 'స్వార్థమే అనర్థ కారణం. అది తెలుసుకొనుటే క్షేమదాయకం' అన్నాడో మహాకవి. పదండి సరదాగా కబుర్లు చెప్పుకుందాం.'' అంటూ కిరణ్ సుమ చేయి అందుకుని ఒక ప్రక్కకు వెడుతుంటే కృష్ణ దిగులుగా నిలబడిపోయాడు.

''ఏమిటీ చెప్పులు కూడా మోసం చేశాయని బాధ పడుతున్నారా? నేను మాత్రం అలాంటిదాన్ని కాను లెండి'' అని శ్రావ్య గల గలా నవ్వుతుంటే తానూ నవ్వక తప్పలేదు కృష్ణకి.

★